ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 17 డిసెంబరు 2024 | 5





ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

గ్రీవెన్స్‌కు 191 అర్జీలు

అర్జీలు స్వీకరించిన కలెక్టర్ మహేష్‌కుమార్



దివ్యాంగుల వద్ద అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కార మార్గాలు చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అర్జీలు రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా అర్జీదారుడు సంతృప్తి పడేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడంచెల విధానంలో అర్జీదారుల సంతృప్తి స్థాయిలను నిరంతరం పర్యవేక్షిస్తుందని వివరించారు. క్షేత్ర స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని జిల్లా అధికారులు సమస్యల పరిష్కారాలకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమంలో భాగంగా తొలుత దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి వారి నుంచి అర్జీలను కలెక్టర్ మహేష్‌కుమార్ స్వీకరించారు. ఆయనతోపాటు డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 191 అర్జీలను స్వీకరించారు. నిబంధనల మేరకు సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతూ మీ కోసం కార్యక్రమ నిర్వహణ, పనితీరు పట్ల అర్జీదారుల్లో విశ్వసనీయతను పెంపొందించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వానపల్లి పర్యటనకు సంబంధించి ఇంకా 28 అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, ఎల్డీఎం కేశవవర్మ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, కోఆర్డినేటర్ ఎస్.త్రినాథరావు, కార్మికశాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ ఏడీ కె.విశాలాక్ష్మి పాల్గొన్నారు.

నెలాఖరులోగా పంటల బీమా చేయించుకోవాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంట బీమా పథకానికి ఈ నెలాఖరు వరకు గడువు ఉందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. పంటల బీమా పథకానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. జిల్లాలో టాటా ఇన్సూరెన్సు కంపెనీకి రైతులు ఎకరాకు రూ.630 ప్రీమియంగా చెల్లించాలన్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాల మూలంగా పంటకు నష్టం వాటిల్లితే ఎకరాకు గరిష్ఠంగా రూ.42వేల వరకు బీమా పరిహారంగా పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఎల్డీఎం కేశవవర్మ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం గ్రీవెన్స్‌కు 15 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమం సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ బి.కృష్ణారావు అర్జీదారుల సమస్యలు నేరుగా విన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 15 అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కిందిస్థాయి పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక కలెక్టరేట్‌లో వలంటీర్ జనిపల్లి దుర్గాప్రసాద్ హత్యకు బాధ్యులైన మిగిలిన వారిని అరెస్టు చేయాలంటూ మృతుని భార్య శ్రావణసంధ్య అర్జీ అందించారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి సుభాష్



వివిధ అంశాలపై చర్చిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

అమలాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. సోమవారం అమలాపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి, ఎమ్మెల్యేలు జిల్లా అభివృద్ధిపై సుదీర్ఘ చర్చలు జరిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరుమాసాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి జిల్లాలోని అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్నారన్నారు. జిల్లాలోని తాగునీటి సమస్య, గుంతల రోడ్లను అభివృద్ధి చేయడం, విద్య, వైద్యం, నిరుద్యోగ నిర్మూలన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. సమావేశంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మండపేట, అమలాపురం, కొత్తపేట, రాజోలు ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, దేవ వరప్రసాద్‌లు సమావేశంలో పాల్గొని అభివృద్ధికి సంబంధించి ప్రణాళికల రూపకల్పనపై పలు సూచనలు చేశారు.

బీచ్ వాలీబాల్ ఏర్పాట్లు పరిశీలన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఉప్పలగుప్తం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం నియోజకవర్గానికి జాతీయ గుర్తింపు తెచ్చేందుకు ప్రణాళిక రచన చేస్తున్నామని, అందుకు అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఎస్.యానాం సముద్ర తీరాన సోమవారం ఆర్డీవో మాధవితో కలిసి బీచ్ వాలీబాల్ పోటీల నిర్వహణ ఏర్పాట్లకు భూమిపూజ చేశారు. వాలీబాల్ నిర్వహణ కమిటీ చైర్మన్ పలచోళ్ల పద్మనాభం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ఎస్.యానాం బీచ్ అభివృద్ధి, టూరిజం ప్రాజెక్టు అంశాలపై వివరించారు. ఎస్.యానాం బీచ్‌ను జాతీయ టూరిజం పటంలో చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తయితే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 27,28,29 తేదీల్లో మహిళల జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎనిమిది రాష్ట్రాల నుంచి మహిళా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ బీచ్ వాలీబాల్ పోటీలకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు, స్థానికులు సహకరించి ఈ పోటీలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సముద్ర తీరాన్ని వాలీబాల్ క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు భూమిని చదును చేస్తున్న పనులను ఎమ్మెల్యే, ఆర్డీవో పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈఈ రాజ్‌కుమార్ పనులు జరుగుతున్న తీరును వారికి వివరించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, చల్లపల్లి నీటి సంఘం చైర్మన్ దంగేటి చిట్టిబాబు, సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పెచ్చెట్టి చంద్రమౌళి, పినిశెట్టి నరసింహారావు, ఆకేటి పెద్ద, సత్తి చిన్నా, మేకల నానాజీ, లంకే భీమరాజు, అయితాబత్తుల రాజశేఖర్, చీకట్ల శ్రీను, ఎ.అజయ్‌సింగ్, అడపా అవినాష్, అరదాని శ్రీను, మంచెం బాబి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పరుగు



పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

- 2026కి పూర్తి కావాలని ఆదేశం
- షెడ్యూల్ ప్రకటించిన బాబు
- మూడు రోజులు రాక్ పరిశీలన
- సీఎంకు కట్టుదిట్టమైన భద్రత
- పోలవరం సిబ్బందికి అనుమతిలేదు
- పూలబొకేల నిరాకరణ
- సీఎం చెంత ఈఎన్‌సీ, సెక్రటరీ, సీఈ

రాజమహేంద్రవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఇక పరుగులు పెట్టనుంది. సీఎం నారా చంద్రబాబునాయుడు స్వయంగా ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి పూర్తి చేయడానికి షెడ్యూల్ ప్రకటించారు. దీంతో ప్రజా ప్రతినిధులు, అధికారులతోపాటు ప్రజల్లో కూడా ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది. సీఎం చంద్రబాబు స్వయంగా పనులు పరిశీలించడంతోపాటు అనేక విషయాలు ఆరా తీశారు. వ్యూపాయింట్ నుంచి స్పిల్‌వే, దానికి అవతల ప్రాజెక్టు కట్టబోయే ప్రాంతాన్ని పవర్ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. తూర్పుగోదావరి వైపు జరుగుతున్న పవర్ ప్రాజెక్టును సీఎంకు ఈఎన్‌సీ చూపించడంతో అంతేనే ఇంకా ఎత్తు ఉంటుందా అని సీఎం అడగడంతో అంతేనని అధికారులు చెప్పారు. ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని, అక్కడ జరుగుతున్న శాండ్ ఫిల్లింగ్, డయా ఫ్రంవాల్ నిర్మించే ప్రాంతంలో వైబ్రో కాంపాక్షన్, దిగువ కాఫర్ డ్యామ్ ప్రాంతం తిలకించారు. ప్రాజెక్టు మీద అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే సమయం గురించి అధికారుల సమీక్షలో చంద్రబాబు ఆరా తీశారు. 2027కి పూర్తి చేస్తామని అధికారులు చెప్పగా 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు సివిల్ పనులు 2026 మేనెల, జూన్ నెలల నాటికి పూర్తి చేస్తే ఒక సీజన్ కోల్పోకుండా ఉండవచ్చన్నారు. 2026 నుంచి ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండేలా చూడాలని చెప్పారు. మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ రూ.12,157 కోట్లు ఖర్చుచేయగా అందులో రూ.2,345 కోట్లు కేంద్రం ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7 లక్షల 27 వేల ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వస్తుందన్నారు. గత ఐదేళ్లలో నిర్వీర్యమైన ప్రాజెక్టుకు చంద్రబాబు రాకతో కళ వచ్చినట్టయింది.

బాబు వచ్చారు..కళొచ్చింది..



సీఎం చంద్రబాబుకు ప్రాజెక్టు పనుల తీరును లాప్‌టాప్‌లో చూపిస్తున్న సిబ్బంది

భద్రత కట్టుదిట్టం..

సీఎం పర్యటన భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎవరినీ సీఎం చెంతకు వెళ్లనీయలేదు. కనీసం నాయకులను పూలబొకేలు ఇచ్చేందుకు అనుమతించలేదు. తప్పని పరిస్థితుల్లో నాయకులు ఒకటి రెండు పువ్వులను ఇచ్చి సీఎంకు స్వాగతం పలికారు. సుమారు 800 మంది పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. కనీసం ఇరిగేషన్ ప్రాజెక్టులో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న అధికారులను సీఎం వద్దకు వెళ్లకుండా రాజమహేంద్రవరానికి చెందిన ఓ డీఎస్పీ అడ్డుకున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు అసహనానికి గురయ్యారు. సీఎం వద్దకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతోపాటు ఇరిగేషన్ సెక్రటరీ, ఈఎన్‌సీ, సీఈలను మాత్రమే అనుమతించారు. మ్యాప్ చూపినపుడు, ఫొటో ఎగ్జిబిషన్‌లో కూడా సీఎంకు ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు వివరించి చెప్పారు. కనీసం వినతులివ్వడానికి ప్రజలను సీఎం చెంతకు వెళ్లనీయ లేదు. అది గమనించిన సీఎం వెనక్కి వచ్చి వినతులు తీసుకున్నారు. ఇతర ప్రజాప్రతినిధులకు వచ్చే డౌట్లు తీర్చడానికి ప్రాజెక్టులో పనిచేసే అధికారులు అందుబాటులో లేక ఇబ్బందిగా మారింది.

నేటి నుంచి రాక్ పరీక్షలు

ప్రధాన డ్యామ్ ఎర్త్‌కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణానికి చాలా రాక్ (రాయి) అవసరం ఉంటుందని, ఎక్కడెక్కడ ఏ రాయి ఉందో ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చంద్రబాబుకు తెలిపారు.ఇక్కడ పనులకు అవసరమైన అనుమతులు పొందవలసిన అవసరం గురించి సమీక్షించారు. ముఖ్యంగా రాళ్ల నాణ్యతను పరిశీలించడానికి మంగళవారం ఒక నిపుణుల కమిటీ రానుంది. మూడు రోజులపాటు ఇక్కడే ఉండి, పలు రకాల రాళ్ల పరీక్ష చేస్తారు.



చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

4 గంటలు ఇక్కడే..

ఉదయం సుమారు 11.45 గంటలకు హెలికాఫ్టర్ దిగిన వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతంపలికారు. మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు గులాబీ పూలతోనూ, పసుపురంగు పూలతోనూ స్వాగతం పలికారు. సుమారు 4 గంటలపాటు ప్రాజెక్టు ప్రాంతమంతా కలియతిరిగారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకట్రాజు, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి, కలెక్టర్లు పి.ప్రశాంతి, వెట్రి సెల్వి, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న బీవీఆర్ చౌదరి



అమలాపురంలోని నీటిపారుదల శాఖ కార్యాలయం

కోనసీమ జిల్లాలో 15 డీసీలకు నేడు ఎన్నికలు

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల ఆర్వో, ఏఆర్వోలను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

డీసీ ఎన్నికలకు రంగం సిద్ధం

అమలాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని 15 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మంగళవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలోకి వచ్చే సాగునీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు తొలుత డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత కమిటీ వైస్ చైర్మన్‌ను కూడా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఎన్నికల అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీసీల ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు పోలీసులను కోరారు. దాంతో మంగళవారం జరిగే డీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై ఎన్డీయే కూటమి నేతలు దృష్టి సారించారు. కొన్నిచోట్ల పోటాపోటీగా నామినేషన్లు వేసేందుకు నేతలు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

ఎన్నికల అధికారుల నియామకం..

జిల్లాలో మంగళవారం జరిగే డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలకు ఎన్నికల అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గోపాలపురం డీసీకి కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఎన్నికల అధికారిగాను, ఆత్రేయపురం తహశీల్దార్ పి.రాజేశ్వరరావును అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగాను నియమించారు. అవిడి డీసీకి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె.వెంకట్రావు ఆర్వోగాను, ఏఆర్వోగా కొత్తపేట తహశీల్దార్ వై.రాంబాబును నియమించారు. అమలాపురం డీసీకి ఆర్డీవో కె.మాధవి ఆర్వోగాను, తహశీల్దార్ జీడీ కిశోర్‌బాబు ఏఆర్వోగాను, అల్లవరం డీసీకి జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి ఆర్వోగాను, అల్లవరం తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు ఏఆర్వోగాను, మురమళ్ల డీసీకి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి ఆర్వోగాను, ఐ.పోలవరం తహశీల్దార్ సీహెచ్ విజయశ్రీ ఏఆర్వోగాను, కాట్రేనికోన డీసీకి ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి ఆర్వోగాను, కాట్రేనికోన తహశీల్దార్ పి.సునీల్‌కుమార్ ఏఆర్వోగాను, పి.గన్నవరం డీసీకి జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు ఆర్వోగాను, తహశీల్దార్ పి.శ్రీపల్లవి ఏఆర్వోగాను, అయినవిల్లి డీసీకి డిప్యూటీ కలెక్టర్ వి.మదన్మోహన్ ఆర్వోగాను, అయినవిల్లి తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఏఆర్వోగాను, రాజోలు డీసీకి డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్ ఆర్వోగాను, రాజోలు తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ ఏఆర్వోగాను నియమితులయ్యారు. అదేవిధంగా ఎర్రపోతవరం డీసీకి సమగ్రశిక్ష ఏపీసీ ఎ.మధుసూదనరావు ఆర్వోగాను, కపిలేశ్వరపురం తహశీల్దార్ సీహెచ్ చిన్నారావు ఏఆర్వోగాను, రామచంద్రపురం డీసీకి ఆర్డీవో ఆర్వోగాను, రామచంద్రపురం తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఏఆర్వోగాను, కూళ్ల డీసీకి ఆర్‌అండ్‌బీ ఈఈ బి.రాము ఆర్వోగాను, కపిలేశ్వరపురం డిప్యూటీ తహశీల్దార్ కె.జానకిరామయ్య ఏఆర్వోగాను, కోటిపల్లి డీసీకి జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్.మురళీకృష్ణ ఆర్వోగాను, తహశీల్దార్ బి.మృత్యుంజయరావు ఏఆర్వోగాను, ఆలమూరు డీసీకి డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ ఆర్వోగాను, ఆలమూరు తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబును ఏఆర్వోగాను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి బోసుబాబును, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పి.వెంకటేశ్వర్లును రిజర్వు స్టాఫ్‌గా నియమించారు. కాగా 15వ డీసీగా కొత్తగా ఉప్పలగుప్తం డీసీని ఏర్పాటు చేశారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యుల ఎన్నిక జరిగేది ఇలా..

మండలాల వారీగా నిర్దేశించిన ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఉదయం 9 గంటలకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష స్థానానికి నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకోసం 15 నిమిషాల సమయాన్ని కేటాయించారు. 9.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తారు. ఏకగ్రీవం కాని పక్షంలో 9.30 గంటల నుంచి 10 గంటల వరకు ఎన్నిక నిర్వహిస్తారు. అనంతరం 10.30 గంటల వరకు కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి అధ్యక్షుడి ఎన్నికను ప్రకటిస్తారు. అనంతరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడి ఎన్నిక ప్రారంభిస్తారు. 11 గంటల నుంచి 11.15 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11.30 గంటలకు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. ఏకగ్రీవం కాని పక్షంలో 11.30 గంటల నుంచి 12 గంటల వరకు ఎన్నిక నిర్వహిస్తారు. అనంతరం 12.15 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేసి ఉపాధ్యక్షునిగా ఎన్నికైన వారి పేర్లను ప్రకటిస్తారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి కృషి

టిడ్కో చైర్మన్ వి.అజయ్‌కుమార్



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

అల్లవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం బోడసకుర్రులో 1632 టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తామని టిడ్కో చైర్మన్ వి.అజయ్‌కుమార్ తెలిపారు. బోడసకుర్రులోని టిడ్కో ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించి వారి సమస్యలను తెలుసుకుని మాట్లాడారు. ఇక టిడ్కో ఇళ్ల వద్ద తాగునీరు, రహదారి సమస్య, శ్మశాన వాటిక సమస్యలు ఉన్నాయని అక్కడ లబ్ధిదారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారని చెప్పారు. టిడ్కో భవన సముదాయం వద్ద వసతులు, విద్యుత్ సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. రూ.11 లక్షలు కడితే విద్యుత్ సమస్యలు తీరుతున్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఉపాధి కల్పన, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యలు తీసుకువెళ్తున్నట్టు చైర్మన్ అజయ్‌కుమార్ వివరించారు. టిడ్కో లబ్ధిదారుల వేధింపులు తగ్గించేందుకు బ్యాంకర్లతో వారికి న్యాయం చేస్తానన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యానాగేంద్రమణి, కమిషనర్ రాజు, కల్వకొలను తాతాజీ, యాళ్ల నాగసతీష్, నల్లా శ్రీధర్, కొప్పుల నాగమానస, ఆశెట్టి ఆదిబాబు, అడపా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

7లో

19న ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ పర్యటన

జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి

అమలాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణ అంశాలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేందుకు ఏకసభ్య కమిషన్ నియమించినట్టు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రాను కమిషన్ సభ్యునిగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ నెల 19న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కాకినాడలో పర్యటిస్తారన్నారు. అంతేకాకుండా జిల్లా యంత్రాంగంతో, వివిధ ఉపకులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతిపత్రాలు స్వీకరిస్తారు. జిల్లాకు సంబంధించిన వ్యక్తులు, కులసంఘాలు తమ వినతులను ఈ నెల 19న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో అందజేయాలి.

రైలు ప్రయాణికుల.. రక్షణ కవచం

BHARAT KA KAVACH

KAVACH





ఆంధ్రజ్యోతి/సామర్లకోట

రైలు ప్రమాదాలు.. ఈ మాట మనం అప్పుడప్పుడూ వింటుంటాం.. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాల కారణంగా ఈ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు రావడం.. అవి ఢీకొనడం.. లేదా రైలు పట్టాలు తప్పడం అనేవి ప్రధాన కారణాలు. ఇలాంటి ఘటనల్లో పదుల సంఖ్యలో ఒక్కోసారి వందల సంఖ్యలో కూడా ప్రాణాలు పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదాల నివారణకు రైల్వే శాఖ 'కవచ్' అనే విధానాన్ని తీసుకువచ్చింది. మన ఉమ్మడి జిల్లా పరిధిలో తుని నుంచి నిడదవోలు వరకు 130 కిలోమీటర్ల మేర పలు రైల్వేస్టేషన్ల మీదుగా రైల్వే ట్రాక్‌లు విస్తరించి ఉన్నాయి. వందల సంఖ్యలో రైళ్లు ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన ప్రాంతంలో 'కవచ్' ఆవశ్యకత గురించి తెలుసుకుందాం..

- ప్రయాణికుల భద్రతకు పటిష్ట వ్యవస్థ 'కవచ్'
- దక్షిణ మధ్య రైల్వేలో విజయవంతంగా అమలు
- ఉమ్మడి జిల్లాలో తుని-నిడదవోలు వరకు 130 కిలోమీర్ల మేర విస్తరించిన రైల్వేలైన్లు
- నిత్యం రాకపోకలు సాగిస్తున్న 120 రైళ్లు

రైల్వేతో ఎంతో అనుబంధం

గోదావరి జిల్లాల ప్రజలకు రైల్వేతో ఎంతో అనుబంధం ఉంది. అటు విశాఖ వైపు, ఇటు విజయవాడ వైపు అనేక అవసరాల దృష్ట్యా ఎన్నో ఏళ్లుగా ప్రజలు రైళ్లలో ప్రయాణాలు సాగిస్తున్నారు. సాధారణ ప్రయాణాలు, వ్యాపార అవసరాలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, చదువుల నిమిత్తం, ఆధ్యాత్మిక, పర్యాటక గమ్యస్థానాలు చేరుకోవడానికి.. ఇలా రకరకాల కారణాలతో చాలా మంది నిత్యం రైలు ప్రయాణాలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల ప్రజలు సుదూర ప్రయాణాల్లో భాగంగా మన జిల్లా మీదుగా రైళ్లలో ప్రయాణిస్తుంటారు. ఇలా కొన్ని లక్షల మంది ప్రజలను కొన్ని వందల రైళ్లు మన జిల్లా మీదుగా తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. విశాఖనుంచి వచ్చే రైళ్లు కాకినాడ జిల్లా తునిలో ప్రారంభమై అన్నవరం, చేబ్రోలు, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట చేరుకుంటాయి. ఇక్కడినుంచి కాకినాడ వరకు ప్రత్యేక లైను ఉంది. సామర్లకోట మీదుగా మేడపాడు, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు, అనపర్తి, ద్వారపూడి, జేగురుపాడు, వేమగిరి, కడియం, రాజమహేంద్రవరం చేరుకుంటాయి. ఇక్కడ రాజమహేంద్రవరం టౌన్‌తోపాటు గోదావరి స్టేషన్ కూడా ఉంది. ఇక్కడ రైల్వేలైను రోడ్‌కం రైలు బ్రిడ్జి మీదుగా, మరోలైను గోదావరి ఆర్ బ్రిడ్జి మీదుగా కొవ్వూరు-పశివేదల- నిడదవోలు చేరుకుంటాయి. అక్కడినుంచి భీమవరం మీదుగా ఒకటి, ఏలూరు మీదుగా మరొకటి విజయవాడకు చేరుకుంటాయి.



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైళ్ల ఆపరేటింగ్ సిస్టమ్

కవచ్ పనిచేసే విధానం

కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలంటే లోకో పైలె ట్ల ఇంజన్ ఛాంబర్‌లో ప్రత్యేకమైన కవచ్ సాఫ్ట్ వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ట్రాక్ వెంబడి ఉన్న ప్రతి రైల్వేస్టేషన్‌లోను కవచ్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్ స్టాలేషన్ చేస్తారు. ట్రాక్ పొడవునా టెలీకమ్యూనికేషన్ టవర్లను నెలకొల్పుతారు. ట్రాక్‌ల వెంబడి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను అమర్చుకుంటూ వెళ్తారు. ఈ వ్యవ స్థలు నిరంతరాయంగా పనిచేస్తాయి. ఒకే ట్రాక్‌లో నిర్దిష్ట సమయంలో ఎదురెదురుగా రైళ్లు వస్తుంటే చాలా దూరం నుంచే కవచ్ పసిగట్టి వెంటనే పైలెట్లకు వీడియో, ఆడియోలతో కూడిన ప్రమాద సంకేతాలను అందిస్తుంది. ఒకవేళ లోకో పైలట్ ప్రతిస్పందించకపోతే కవచ్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. వెంటనే రైళ్ల వేగాన్ని తగ్గించేస్తుంది. రైల్వేట్రాక్ వెంబడి ఉన్న ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు ఎప్పటికప్పుడు కవచ్‌కు వాటి స్థితిగతుల గురించి సమాచారాన్ని ఇస్తాయి. దీంతో రియల్ టైమ్ డేటా ఆధారంగా కవచ్ పనిచేస్తూ రైళ్లను ఢీకొనకుండా నియంత్రిస్తాయి.

ఎల్‌హెచ్‌బీ భోగీ కొంతవరకే పరిమితం

ఒకేట్రాక్‌పై రెండు రైళ్లు ఎదురెదురుగా దూసుకురావడంవల్ల 90శాతం రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైలు పట్టాలు తప్పినా ప్రమాదం జరుగుతుంది. ప్రస్తుతం అందుబాటులోకి తీసుకువచ్చిన ఎల్‌హెచ్‌బీ భోగీల కారణంగా పట్టాలు తప్పినా అవి బ్యాలెన్స్ చేసుకుంటున్నాయి. ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చే రైళ్లు ఢీకొంటున్నప్పుడు మాత్రం ఎల్‌హెచ్‌బీ బోగీలైనా ప్రయాణికులు చనిపోతున్నారు. ఈ బోగీలు కేవలం పట్టాలు తప్పితే మాత్రమే బ్యాలెన్స్ చేయడానికి పరిమితమవుతున్నాయి. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు సిగ్నలింగ్‌లో సమస్యలు ఉన్నప్పుడే వస్తుంటాయి. మాన్యువల్‌గా ఇచ్చే సిగ్నళ్లలో ఏమాత్రం పొరపాటు జరిగినా ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. దీన్నిదృష్టిలో ఉంచుకుని ఇటీవల కాలంలో తక్కువ దూరంలో మరిన్ని సిగ్నల్స్ ఏర్పాటు, ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్ వం టివి ఏర్పాటు చేస్తున్నారు. ఇవి చాలా వరకూ సత్ఫలితాలు ఇస్తున్నా ఇటీవల కాలంలో తాజాగా చెన్నైలో జరిగిన ప్రమాదం.. ఇంకా పటిష్టమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన పరిస్థితిని చాటి చెబుతోంది. ఇందులోభాగంగా కవచ్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజయవంతంగా పరీక్షించారు. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు దూసుకువస్తుంటే ఈ వ్యవస్థవల్ల పైలెట్లతో సంబంధం లేకుండా రైలు వేగాన్ని తగ్గించి వాటిని నిలుపుదల చేస్తుంది. దీని సాంకేతిక విధానాలను ఆంధ్రజ్యోతికి ఒక రైల్వే ఉన్నతాధికారి వివరించారు.



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలు

కవచ్ అంటే ఏంటి?

కవచ్‌ను యాంటీ కొలిజన్ సిస్టమ్ అని కూడా పిలుస్తారు. రైళ్ల భద్రతను పెంచేందుకు పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని రూపొందిం చారు. ఒకే ట్రాక్‌పైకి ఎదురెదురుగా వచ్చే రైళ్ల ప్రమాదాలను నివారిం చడం, వెనుక నుంచి రైళ్లు ఢీకొనడం, అతివేగం కారణంగా పట్టాలు తప్పడం ఎదురెదురుగా వచ్చే వాటిని ఢీకొనాల్సిన పరిస్థితుల్లో ప్రమాదాలను నివారించే వ్యవస్థ ఈ కవచ్. ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్(ఏబీఎస్), ఆటోమేటిక్ వార్నింగ్ సిస్టమ్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) ట్యాగ్‌లు, జీపీఎస్-జీఎస్ఎం కమ్యూనికేషన్స్ మిళితంగా కవచ్ వ్యవస్థ ఆధారపడి పనిచేస్తుంది.



సామర్లకోటలో ఆగిన రైలులో లోకోపైలట్ క్యాబిన్

మనకీ.. కవచ్ అవసరం

కవచ్ వ్యవస్థను మొదటిసారిగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ప్రయోగాత్మకంగా ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తున్నారు. కవచ్ వ్యవస్థ అమల్లో ఉన్న ట్రాక్‌ల్లో ప్రమాదాలు దాదాపుగా తగ్గాయి. ఇటీవలకాలంలో రైళ్లు సమయపాలనతో నడుస్తున్నాయి. నిర్వహణ ఖర్చులు తగ్గుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద రైల్వేడివిజన్‌గా ప్రసిద్ధి పొందిన విజయవాడ రైల్వేడివిజన్ పరిధిలో రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా ప్రతిరోజూ ప్రయాణికులకు, రవాణా అవసరాలకు 120 రైళ్ల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయి. కాకినాడ నుంచి ప్రయాణికుల రైళ్లే కాకుండా రవాణా రైళ్లు కూడా అధికంగానే రాకపోకలు సాగిస్తున్నాయి. తీవ్ర రద్దీ దృష్ట్యా ఈ మార్గంలో భవిష్యత్తులో ఉపద్రవాలను నివారించాలంటే కవచ్ వంటి వ్యవస్థ ఎంతో కీలకంగా మారింది.

మెరుగైన చేతిరాతతో ఉజ్వల భవిత

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

పిఠాపురంలో విద్యార్థుల చేతిరాత మెరుగుపరిచే నైపుణ్య కార్యక్రమం



పిఠాపురంలో నైపుణ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి మెరుగైన చేతిరాతతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భారతీరంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ సొసైటీ (బ్రోవ్స్) సంస్థ వ్యవస్థాపకుడు వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 12వేల మంది విద్యార్థుల చేతిరాతను మెరుగుపరిచే నైపుణ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల చేతిరాత మెరుగపరిచే విధంగా శిక్షణ ఇవ్వడంతో పాటు అందుకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా ఇచ్చేందుకు బ్రోవ్స్ సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చేతిరాతను మెరుగుపరుచుకోవడం ద్వారా తమ భవిష్యత్తును విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలుగుతారని, ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డీవైఈవో వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ కనకారావు తదితరులున్నారు.

కాకినాడ 'పీఆర్'లో జాతీయస్థాయి సదస్సు



సదస్సులో హిందీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కాకినాడ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ టీవీ తిరుపాణ్యం అధ్యక్షతన కళాశాల తెలుగు,హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.హరిరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. గౌరవ అతిథులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ పి.ప్రేమానందం, మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జీవీ రత్నాకర్ విశిష్ట అతిథులుగా.. సినీ సంగీత దర్శకులు సాలూరు వాసూరావు, గురజాడ అప్పారావు ముని మనవడు డాక్టర్ మోపిదేవి విజయగోపాల్ పాల్గొనగా డాక్టర్ నల్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో దేశభక్తి పెంపొందుతుందన్నారు. ఏఎన్‌యూ పూర్వపు రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాద మూర్తి అభ్యుదయ సాహిత్యంపై ప్రసంగించారు. అనంతరం అతిథులు డాక్టర్ పి.హరిరామ్‌ప్రసాద్ రచించిన హిందీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలుగు, హిందీ వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధక విద్యార్థులు, కళాశాల విద్యార్థులు తెలుగు, హిందీ భాషల్లో తమ పరిశోధక పత్రాలను సమర్పించారు.

28న విద్యార్థులకు చాగంటి ప్రవచనం

కాకినాడ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే పదో తరగతి పరీక్షలు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థుల నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఈనెల 28న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు ఎంఎస్ఎన్ విద్యాసంస్థల డైరెక్టర్, యునైటెడ్ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ ప్రవచన కర్త చాగంటిని మర్యాదపూర్వకంగా కలిసి వచ్చే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించాలని కోరగా అంగీకరించారు. కాకినాడ రాజాట్యాంక్ పార్కు వద్ద గల ఫ్యాబిన్ కన్వెక్షన్ హాల్‌లో ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.చాగంటిని శాలువాతో శ్రీవిజయ్ సత్కరించారు.



చాగంటిని శాలుశాతో సత్కరించి పూల బొకే అందజేస్తున్న శ్రీ విజయ్

ఒత్తిడిని దూరం చేసేందుకే క్రీడా పోటీలు

ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక

ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో

స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ప్రారంభం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో దేహ దారుఢ్యం.. మానసికోల్లాసం లభిస్తుందని ఏపీఎస్పీ కమాండెంట్, ఐపీఎస్ అధికారిణి ఎం.దీపిక అన్నారు. కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో సోమవారం యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో బెటాలియన్ పోలీసులు బిజీగా ఉంటారని, కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తుంటారన్నారు. ఒత్తిడిని దూరం చేసేందుకు ఏటా బెటాలియన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహిస్తూ సిబ్బంది, అధికారుల్లో నూతనోత్సాహం నింపడం జరుగుతుందన్నారు. ప్రతీ రోజూ వ్యాయామం చేస్తున్నా క్రీడలు ఆడటం వల్ల ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటా మన్నారు. పోలీసుశాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమన్నారు. ముందుగా బెటాలియన్‌లో ఉన్న 7కంపెనీల స్పోర్ట్స్ సిబ్బంది మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా సిబ్బంది నుంచి కమాండెంట్ గౌరవ వందనం స్వీకరించి, గాల్లోకి బెలూన్స్ విడిచిపెట్టి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారిణి ఆర్.సుస్మిత, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు డి.మురళీకుమార్, ఎం.మోహన్‌రావు, బిఎస్.చంద్రశేఖరరావు, ఎస్.మన్మథరావు, యూని ట్ మెడికల్ ఆఫీసర్లు సునీల్, లక్ష్మి, ఆర్ఐలు కె.రవిశంకర్, బి.విఠలేశ్వరరావు, ప్రసాద్, యూనిట్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీలను తిలకిస్తున్న కమాండెంట్ దీపిక



లాంగ్ జంప్ పోటీలు



వాలీబాల్ పోటీలు

బలమైన పునాదులతో అద్భుత ఫలితాలు

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు

దివాన్‌చెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు భాష, గణితంలో పునాది బలంగా ఉంటేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలరని ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్రశిక్షా ఏఎంవో పి.రాంబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ 5వ దశ ఆరు రోజుల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలన్నారు. 2030 నాటికి సాధించాల్సిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను అందించాల్సిన విషయాన్ని నూతన జాతీయ విధానం స్పష్టం చేసిందన్నారు. ప్రథమ్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ జగదీష్, డైట్ పరిశీలకులు సుజాతారత్నం మాట్లాడుతూ విద్యార్థి దశలో మొదటి ఎనిమిదేళ్ల ప్రారంభ సంవత్సరాలని, ఇది అత్యంత కీలకమైన దశగా పేర్కొన్నారు. ఈ దశలోనే మానసికాభివృద్ధి, అభ్యసన వేగంగా ఉంటాయన్నారు. సమావేశంలో డైట్ లెక్చరర్ గంగాధరరావు, ఎంఈవోలు కె.తిరుమలరావు, సీహెచ్ ఆంజనేయులు మాట్లాడారు. ఈ ఐదో బ్యాచ్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 270 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందనున్నట్లు కోఆర్డినేటర్ రాంబాబు తెలిపారు. సమావేశంలో ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్లు అనూష, జీవన్, కేఆర్‌పీలు కె.గంగాధరరావు, ఎం.రాంబాబు, వెన్యూ ఆర్గనైజర్ పవన్, 18మంది డీఆర్పీలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఎయిమ్స్ పరీక్షలో అన్వితకు మొదటి ర్యాంకు

కాకినాడ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంటిపిల్లల వైద్యశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యు యేషన్ పూర్తి చేసుకుని పీడియాట్రిక్ న్యూరాలజీ స్పెషాలిటీ కోర్సు చేసేందుకు ఎయిమ్స్ నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షలో కాకినాడ భానుగుడి ప్రాంతానికి చెందిన డాక్టర్ అన్విత రాళ్లపల్లి మొదటి ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్విత సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కోర్సులో చేరేందుకు ఎంట్రన్స్ కోటాలో 2 సీట్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. ప్రణాళికబద్ధంగా చదవడంతో పాటు ఉపాధ్యాయులు మంచి కోచింగ్ అందించారన్నారు. అదేవిధంగా తన తల్లి దండ్రులు డాక్టర్ చక్రపాణి, డాక్టర్ సరస్వతిలు అందించిన ప్రోత్సాహం వల్ల జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించగలిగానన్నారు. వైద్య విద్య పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనే వైద్య సేవలు అందిస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు ప్రముఖులు, వైద్యులు అన్వితను అభినందించారు.



మీడియాతో మాట్లాడుతున్న అన్విత

కోట సత్తెమ్మకు చీర,సారె సమర్పణ



కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అధికారులు



చీర సారె తీసుకువస్తున్న మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు నాంగల్యదేవి దేవస్తానాల ప్రతినిధులు

నిడదవోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా రెండోరోజు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, నిడదవోలులోని నాంగల్యదేవి దేవ స్థానం అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటసత్తెమ్మకు చీర,సారె సమర్పించారు. వారికి దేవస్థానం తరఫున మేళతాళాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి చీరసారె సమర్పించారు. భక్తులు పాల్గొన్నారు.

'శ్రీప్రకాష్'లో ఉత్సాహంగా జోష్



అతిథులతో శ్రీప్రకాష్ మేనేజింగ్ డైరెక్టర్ విజయప్రకాష్

దివాన్‌చెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాజం పట్ల, పర్యావరణం, జీవితం, అత్యున్నతమైన వాటి పట్ల అవగాహన కల్పించాలని ప్రఖ్యాత కవి, రచయిత, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ల రాఘవేంద్ర అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ 12వ వార్షికోత్సవం (జోష్) సోమవారం సాయంత్రం ఉత్సాహంగా సాగింది. శ్రీప్రకాష్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆకెళ్ల ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏదైనా కార్యక్రమాలు జరిగినపుడు పుస్తకాలను బహుమతులుగా ఇద్దామని, పిల్లలతో పుస్తకాలను చదివించాలని కోరారు. మరో ముఖ్యఅతిథి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ విద్యఎంతో బలమైన ఆయుధమని అన్నారు. మరో ముఖ్యఅతిథి జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్ మోజులో పడవద్దు అని, తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని హితవు పలికారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ విజయప్రకాష్ తమ పాఠశాల నివేదికను సమర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ వైజ్ఞానిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, మేనేజర్ ఏవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.


ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఫ్రాన్స్ దేశస్తులు

వాడపల్లి వెంకన్న ఆలయంలో..
ఫ్రాన్స్ దేశస్తులు

- స్వామి సన్నిధిలో రెండేళ్ల బాలుడి తలనీలాల సమర్పణ
- తిరునామాలు సమర్పించి స్వామివారి దర్శనం

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని సోమవారం ఫ్రాన్స్ దేశానికి చెందిన భక్తులు దర్శించుకున్నారు. వీరి పూర్వీకులు ఈ ప్రాంతానికి చెందినవారే కావడంతో స్వామి విశిష్టతను ఫ్రాన్స్‌కు చెందిన మహిళలు తెలుసుకున్నారు. వీరిలో ఓ మహిళకు రెండేళ్ల బాలుడు ఉన్నాడు. అతడికి తొలి పుట్టివెంట్రుకలను ఆలయంలో స్వామివారి సన్నిధిలో సమర్పించారు. ఆ బాలుడు గుండుకు గంధం కూడా పూయించారు. వారంతా తిరునామాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం మొత్తం తిరిగి ఫ్రాన్స్ దేశస్థులు సందడి చేశారు. భక్తులు వారిని ఆసక్తిగా తిలకించారు. విదేశాలనుంచి వచ్చి ఇక్కడి సంప్రదాయాలను గౌరవించడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

గోదావరి నదిలో మొసలి సంచారం

- లొల్లలో చూసిన స్థానికుడు
- భయాందోళనలో రైతులు

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలోని గోదావరి నదీలో మొసలి సంచరిస్తుందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గౌతమి గోదావరి నదీలో సోమవారం లొల్ల గ్రామానికి చెందిన దాట్ల సత్తిరాజు రైతు పశువులను గోదావరి వద్దకు తీసుకువెళ్లాడు. ఒడ్డుకు చేరుకున్న 9 అడుగుల మొసలని చూసి ఆ రైతు ఆందోళనకు గురయ్యాడు. ఆ రైతు శబ్దం విని ఒడ్డును ఉన్న మొసలి నదీలోకి జారుకుంది. మొసలిని చూసిన రైతు విషయాన్ని పక్కనే ఉన్న రైతులకు వివరించాడు. నిత్యం పాడి రైతులు గోదావరి వద్దకు చేరుకుని పశువులను కడుగుతూ ఉంటారు. శ్మశానవాటిక ఇక్కడే ఉండడంతో మృతదేహాలను ఖననం చేసేందుకు వస్తూ ఉంటారు. దీనిపై రైతులు, ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. గోదావరిలో స్నానం ఆచరించేవారు జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

'రేబిస్'తో వ్యక్తి మృతి

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం కుమ్మరవీధికి చెందిన మానేపల్లి దుర్గాప్రసాద్(37) రేబిస్ వ్యాధితో మృతిచెందాడు. ఆయన ఆర్టీసీలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం ఇంటివద్ద ఉన్న ప్రసాద్‌ను కుక్క కరిచింది. ఈ మేరకు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడినుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రాజోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిమండలం అంతర్వేదికర రావి వారి గ్రూపునకు చెందిన తన చిన్నాన్న రావి వీరవెంకటనరసింహారావును ఆస్తికోసం కొట్టి చంపిన కేసులో రావి రాంబాబును మలికిపురం మండలం దిండి చెక్‌పోస్టు వద్ద రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ సోమవారం అరెస్టు చేశారు. ఈసందర్భంగా రాజోలు సర్కిల్ కార్యాలయంలో సీఐ నరేష్‌కుమార్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితుడు రాంబాబు చిన్నాన్న వీరవెంకటనరసింహారావును కొట్టి చంపాడన్నారు. ఈ కేసును ఛేదించిన రాజోలు సీఐ రాజేష్‌కుమార్, సఖినేటిపల్లి ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, సిబ్బందిని ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ అభినందించారు.

రావులపాలెంలో వివాహిత ఆత్మహత్య


మామిడిశెట్టి శృతి(ఫైల్)

రావులపాలెం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిశెట్టి శృతి(25)కి ఐదేళ్ల క్రితం వెంకన్నబాబుతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. 15వ తేదీ మృతురాలు భర్త పని నిమిత్తం సిద్ధాంతం వెళ్లి అదే రోజు సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూడగా శృతి బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉండడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని మృతురాలు తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తండ్రి కొప్పిశెట్టి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.చంటి తెలిపారు. శృతి ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే కారణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

52 కిలోల గంజాయి పట్టివేత

- రెండు వేర్వేరు కేసుల్లో పట్టుకున్న చింతూరు పోలీసులు


పట్టుబడిన గంజాయి నిందితులతో చింతూరు పోలీసులు


గంజాయి తరలింపు కోసం వ్యాన్‌లో ఏర్పాటు చేసిన అర

చింతూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో సోమవారం చింతూరు పోలీసులు 52 కిలోల గంజాయి పట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఎస్ఐ పి.రమేష్ తెలిపిన వివరాలు ఇలా.. తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు సీలేరులో 50 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. గంజాయి ఎవరి కంటా కనపడకుండా ఉండేందుకని ఒక వ్యాన్‌లో ప్రత్యేక అర ఏర్పాటు చేసి అందులో గంజాయి ప్యాకెట్లను అమర్చారు. అనంతరం చింతూరు మీదుగా తమిళనాడుకు వెళ్లే యత్నం చేశారు. కాగా పోలీసులకు అందిన సమాచారం మేరకు చేపట్టిన వాహన తనిఖీల్లో గంజాయి రవాణా బయటపడిందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు గంజాయితోపాటు వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి రెండు కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. రెండు కిలోలు తరలిస్తూ పట్టుబడిన వ్యక్తి గంజాయి మత్తుకు అలవాటు పడ్డట్టు విచారణలో స్పష్టమైందని ఎస్ఐ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మంచు.. ముంచుతోంది!

- రోడ్డు కనిపించక ప్రమాదాలు
- తూర్పుగోదావరి జిల్లా అనంతపల్లి వద్ద రెండు రోజుల్లో రెండో ప్రమాదం
- వ్యాన్‌ని వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు
- నుజ్జునుజ్జయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు


నుజ్జు నుజ్జు అయిన ప్రైవేటు ట్రావెల్ బస్సు

నల్లజర్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో రాత్రిసమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి హైవేపై ప్రమాదకరంగా మారింది. శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్ ప్రమాదానికి గురికాగా.. సోమవారం తెల్లవారుజామున మరో ప్రైవేటు ట్రావెల్ బస్ ప్రమాదానికి గురైంది. రెండు ప్రమాదాల్లోనూ ప్రయాణికులు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం 40మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అనంతపల్లి చేరుకున్న సమయంలో మంచు ప్రభావం ఎక్కువైంది. దీంతో ముందు ఉన్నవి కనిపించకపో వడంతో రన్నింగ్‌లో ఉన్న ఐసర్ వ్యాన్‌ని ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది.ప్రయాణికులకు ఏటువంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు మరొక బస్సులో వారిని గమ్యస్థానాలకు పంపించి వేశారు.సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

పోలీసులకు సైతం అంతుచిక్కని హత్యలు

- వేట్లపాలెం ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సీరియస్
- ముగిసిన పోస్టుమార్టం ప్రక్రియ

సామర్లకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెంలో దళిత సామాజికవర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య దాడుల సంఘటనపై జిల్లా పోలీసు పోలీసు ఉన్నతాధికారి సామర్లకోట పోలీసు అధికారిపై తీవ్రఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటన సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉండడమేగాక ఈ రెండు కుటుంబాల మధ్య మూడునెలలుగా జరుగుతున్న వివాదం తొలుత వేట్లపాలెం సచివాలయ మహిళా పోలీసు నుంచి పంచాయతీ అధికారులకు, సామర్లకోట పోలీసు అధికారులకు తెలిసిందే. అయినా ఆదివారం రాత్రి జరిగిన కత్తులతో దాడులు ఘటనను పోలీసులు ముందుగా పసిగట్టలేకపోవడంతో వారి వైఫల్యంగానే పలువురు పేర్కొంటున్నారు.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఇంటి స్థలం విషయమై ఒకే సామాజికవర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య ఆదివారం జరిగిన కత్తులతో దాడికి దిగిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం విదితమే. పంచాయతీ అధికారులు సదరు అక్రమ నిర్మాణదారుడికి నోటీసులు సైతం ఇచ్చిన విషయం పోలీసులకు ముందే తెలిసినా పోలీసులకు, ఇంటిలిజెన్స్ వర్గాలకు ఏమాత్రం తెలియని రీతిలో పక్కా వ్యూహాన్ని పన్ని తమ దాడులతో ప్రత్యర్థి వర్గంలో ముగ్గురి హత్యకు కారణమయ్యారు. ఈ సంఘటనలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటి శ్లాబ్ నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉన్న కార్దాల కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఏమాత్రం ఊహించలేకపోవడం వల్లే కత్తిపోట్లకు గురైనట్లు తెలిసింది. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకునే లోపునే కార్దాల కుటుంబాలకు చెందిన ఒకరు మృతి మరో 9మంది వ్యక్తులు రక్తపుమడుగులో ఉన్నారు. సంఘటనా స్థలిలో హాహాకారాలు మిన్నంటడంతో దాడులకు పాల్పడిన వారు తిరిగి కత్తులతో పరారయ్యారు. సంఘటనకు దారి తీసిన వాస్తవ సమాచారాన్ని ఆదివారం రాత్రి కొంతమేర సేకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారి సోమవారం మరింత సమాచారాన్ని సేకరించినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. దీంతో ముమ్మాటికీ పోలీసుల వైఫల్యం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

కాగా ఆదివారం హత్యకు గురైన ముగ్గురి మృతదేహాలకు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తిచేసి సోమవారం రాత్రి వేట్లపాలెంలోని కుటుంబసభ్యులకు అప్పగించడంతో మూడు మృతదేహాలకు వేట్లపాలెం శివారు ఆర్బీ కొత్తూరు వెళ్లే రోడ్డులో దళిత శ్మశానవాటికకు కాకినాడ నుంచి నేరుగా తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సామర్లకోట పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. హత్యా సంఘటన జరిగి 24 గంటలు దాటుతున్నా పోలీసుల చర్యలు అత్యంత గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు దారితీస్తోంది.


హత్యల ఘటనలో దాడికి ఉపయోగించిన కత్తి

వెంకన్న ఆలయంపై ఆరోపణలు అర్థరహితం

- సోషల్ మీడియా పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు: ఈవో

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంపై ఓ వ్యక్తి సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలపై ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తీవ్రంగా ఖండిస్తూ ఆ ఆరోపణలు అర్థరహితమన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 12న దేవదాయశాఖ పర్యవేక్షణాధికారుల సమక్షంలో 300మంది సిబ్బంది సేవకులు, అర్చకులు, గ్రామస్థులు, బ్యాంకు సిబ్బంది సమక్షంలో హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించామన్నారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు నిఘా నీడలో లెక్కింపు ప్రక్రియ ప్రతినెలా చేపడతామన్నారు. ఈ లెక్కింపులో రూ.5లక్షల నగదు గోల్‌మాల్ చేశారని ఓ పార్టీకి చెందిన వ్యక్తి సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టడంతో కలకలం చెలరేగింది. స్వామి వారి ఆలయంపై తప్పుడు ప్రచారం నిర్వహిస్తూ స్వామి ప్రతిష్టతను అపఖ్యాతిపాలు చేస్తూ తప్పుడు ఆరోపణలు చేసిన సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన పెద్దలు హుండీ లెక్కింపు సీసీ ఫుటేజీని పరిశీలించారు. తప్పుడు ఆరోపణలు చేసిన వ్యక్తిపై కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు ఈవో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో నుంచి జారిపడి డ్వాక్రా వీవోఏ మృతి


నారాయణమ్మ (ఫైల్)

తుని రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో డ్వాక్రా వీవోఏ మృతి చెందింది. కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన నల్లల ఆదినారాయణమ్మ(23) డ్వాక్రా వీవోఏగా విధులు నిర్వర్తిస్తోంది. తుని కార్యాలయంలో పనులు ముగించుకుని ఆదివారం రాత్రి ఆటోలో ఇంటికి తిరిగి వెళ్తుండగా జారిపడి తీవ్ర గాయాలపాలైంది. ఆమెను 108 అంబులెన్సులో తొలుత తుని ఏరియా ఆస్పత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్తతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

కాకినాడ క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్ఆర్ జిల్లా రాజవొమ్మంగికి చెందిన 36ఏళ్ల ఎలుసూరి కనకరాజ్‌కుమార్ కాకినాడ మెయిన్‌రోడ్డులోని బజాజ్ ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్ గా పని చేస్తున్నాడు. కాగా జగన్నాథపురానికి చెందిన 25ఏళ్ల లంకె శ్రీనివాస్ చాలా కాలంగా కనకరాజ్‌కుమార్‌కి స్నేహితుడు. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉండడం తో కొంతకాలంగా మనస్పర్థలు ఏర్పడ్డా యి. ఈక్రమంలో ఆదివారం రాత్రి వారి మధ్య ఏర్పడ్డ ఘర్షణ కారణంగా సోమవారం సంస్థలో విధుల్లో ఉన్న కనకరాజ్‌కుమార్‌ను తన కూడా తెచ్చుకున్న కత్తితో శ్రీనివాస్ ఒక్క వేటువేశాడు. తప్పించుకునే క్రమంలో కనకరాజ్‌కుమార్ తలకుబలమైన గాయమైంది. శ్రీనివాస్ అక్కడినుంచి పరారయ్యాడు. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఆగిందని పట్టాలు దాటబోయి..
మరో రైలు ఢీకొని యువకుడి మృతి


అనపర్తి రైల్వేస్టేషన్‌లో రైలు ఢీకొని మృతి చెందిన పవన్

అనపర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మూసి ఉన్న రైల్వే గేటు వద్ద పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా మరో రైలు ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి బాబానగర్‌కు చెందిన కులంపర్తి పవన్(25) ఒక హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం హోటల్ పనికి వెళుతూ బాలుర ఉన్నత పాఠశాల వద్ద మూసి ఉన్న రైల్వే గేటు వద్ద పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తున్నాడు. అప్పటికే గూడ్సు ట్రైన్ ఆగి ఉండడంతో ఆ ట్రైన్ ముందుకు వెళుతుందేమోనన్న మీమాంసతో గూడ్సు బండిని దాటుతుండగా మరో ట్రాక్ పైనుంచి విశాఖ వైపుగా వెళుతున్న మరో గూడ్సు రైలు పవన్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించినట్టు రైల్వే సిబ్బంది తెలిపారు.

ఉపాధి..ఊపిరి తీసింది!

- ట్రాక్టరు తిరగబడి యువకుడి మృతి
- తూర్పుగోదావరి జిల్లా పెద్దేవంలో ఘటన


ట్రాక్టరు తిరగబడి చనిపోయిన దుంపల రాజు

తాళ్లపూడి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి ఊపిరి తీసింది. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన దుంపల రాజు (33) పెద్దేవం శివారులో ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. అతడికి భార్య నెలల వయసు గల బాబు ఉన్నారు. ఇటుకలు తయారు చేయడానికి సోమవారం ఉదయం అడుసు మట్టిని ట్రాక్టరుతో తొక్కిస్తుండగా అకస్మాత్తుగా ట్రాక్టరు తిరగబడి అతను మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు తరలించామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రాజమహేంద్రవరం మహిళ..
హైదరాబాద్‌లో అనుమానాస్పద మృతి


మృతురాలు అన్సర్ జహాన్ (ఫైల్ ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బీటెక్ చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్న రాజమహేంద్రవరానికి చెందిన ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన ఈనెల 12న తెలంగాణ రాష్ట్రం నాంపల్లిలో జరిగింది. మృతురాలు తండ్రి ఫయాజ్ కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోరక్షణపేటకు చెందిన టీడీపీ నాయకురాలు సయ్యద్ అన్సరీ, ఫయాజ్ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అన్సర్ జహాన్(30) బీటెక్ చదువుకుంది. ఆమెకు వివాహమై ఏడేళ్ల పాప ఉంది. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకున్నారు. అటుపై జహాన్ హైదరాబాద్‌లో చైతన్య విద్యాసంస్థలో రెండేళ్లుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో అక్కడే పనిచేసే నాంపల్లికి చెందిన ఆలీ హుస్సేన్ అనే వ్యక్తి ఒక ప్రాజెక్టు వర్కు ఉందని చెప్పాడు. దానికి తాను రూ.5లక్షలు పెడతానని, నువ్వు రూ.5లక్షలు పెట్టాలని, దాన్ని పూర్తి చేస్తే రూ.1.50 కోట్లు వస్తాయని చెప్పాడు. దీంతో ఆమె రూ.5లక్షలు పెట్టుబడి పెట్టింది. ఆలీ హుస్సేన్ నాంపల్లిలో ఆఫీసును ప్రారంభించాడు. ఈ నెలలో పని పూర్తయ్యింది. దీంతో తనకు రావాల్సిన రూ.50 లక్షలు ఇవ్వాలని జహాన్ ఒత్తిడి చేసింది. ఈ నేపథ్యంలో ఈనెల 12వతేదీ సాయంత్రం నాంపల్లిలో ఆఫీస్‌లో జహాన్‌పై హుస్సేన్ రాడ్‌తో కొట్టి చంపేశాడని, ఆపై చున్నీతో ఉరివేసుకున్నట్టు సృష్టించాడని మృతురాలి తండ్రి ఫయాజ్ ఆరోపించాడు. తాను శుక్రవారం తన కుమార్తెకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని, దీంతో అనుమానం వచ్చి ఆమె ఆఫీస్‌కు ఫోన్ చేసినా స్పందన లేకపోయిందని తెలిపారు. ఆలీ హుస్సేన్ విజిటింగ్ కార్డు గతంలో తన కుమార్తె ఇవ్వడంతో అతడికి ఫోన్ చేస్తే అతని తల్లి లిఫ్ట్ చేసి జహాన్ ఉరివేసుకుందని చెప్పారని, దీంతో తాను తన భార్య కలిసి హైదరాబాద్ వెళ్తే జరిగిన విషయం తెలిసిందని చెప్పారు. హత్య చేసిన ఆలీ హుస్సేన్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. సోమవారం అన్సర్ జహాన్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ నివాళులర్పించారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని
రూ.57.75 లక్షల టోకరా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని ముగ్గురు తన వద్ద నుంచి రూ.57లక్షల75వేలు తీసుకుని మోసం చేశారని బొమ్మూరు వెంకటగార్డెన్స్‌కు చెందిన చింతకాయల సోమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన సోమేష్ ఎల్‌అండ్‌టీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతను ప్రస్తుతం బొమ్మూరులో నివాసం ఉంటున్నాడు. అతనికి పరిచయమైన ఆకుల సౌజన్య, ఆకుల శ్రీనివాస్, అజ్జరపు సునీల్ ప్రభుత్వం పాజెక్టులు ఇప్పిస్తామని నమ్మించి దఫదఫాలుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయించుకుని ప్రాజెక్టులు మంజూరైనట్లు లెటర్లు సోమేష్‌కు ఇచ్చారని సోమేష్ ఆరోపిస్తున్నాడు. ఆ లెటర్లు ఫేక్ అని తెలియడంతో తాను డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో తనకు న్యాయం చేయాలని బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయంలో ప్రతాప్‌కు సన్మానం

అంతర్వేది, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి):కర్నూలు జిల్లా మంత్రాలయంలో కర్నూలు కవితోత్సవం పేరిట జాతీయ శతాధిక కవిసమ్మేళనం నిర్వహించిన ప్రముఖ కవి, రచయిత, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌ను సత్కరించారు. కర్నూలు కార్యవర్గం నాగజ్యోతిమలేకర్, సువర్ణజోషి, కేశవయ్య, సిద్ధార్థ్, ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలు

అల్లవరం,డిసెంబరు16(ఆంధ్రజ్యోతి):తహశీల్దారు వీవీఎల్ నరసింహం ఆధ్వర్యంలో గోడి, గోడితిప్ప గ్రామాల్లో సర్పంచ్‌లు తోట శ్రీదేవి, చిట్టిండి శ్రీదేవి అధ్యక్షతన సోమవారం జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో 13ఫిర్యాదులందాయి. ప్రత్యేకాధికారి కర్నీడి మూర్తి, ఎంపీటీసీ కాండ్రేగుల వాణిఅచ్యుతం, ఆర్ఐ కె.మన్యం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వల కట్లతో పంట నష్టపోతున్నాం: రైతులు

కలెక్టర్ గ్రీవెన్స్‌లో రైతుల ఫిర్యాదు

అమలాపురం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పంచనదీ డ్రెయిన్, మరోవైపు లోయర్ కౌశిక డ్రెయిన్లలో వలకట్టు వేయడం వల్ల ముంపు నీరు దిగక ఏటా పంట నష్టపోతున్నామని రైతులు బి.శ్రీనివాస్, కె.రామభాస్కరరావు, ఎన్ఎస్.రాజు, వాసర్ల సూర్యనారాయణ, మొల్లేటి రామకుమార్, కుడుపూడి వెంకటశెట్టి, వాసంశెట్టి శ్రీనివాసరావు తదితరులు కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. రెవెన్యూ డ్రెయిన్లను ఆనుకుని ఉన్న ఆక్వా రైతులు వారి చెరువుల్లోని నీటిని, బురదను మోటార్ల ద్వారా డ్రెయిన్లలోకి తోడడం వల్ల ఆక్వా చెరువులు కలుషితమై పంట పొలాలను చుట్టుముట్టి పంటలు దెబ్బతిని నష్టం వాటిల్లుతోందన్నారు. రామేశ్వరం మొగ వద్ద ఆక్రమణలతో ముంపునీరు సముద్రంలోకి దిగే దారి లేకుండా పోయింది. మేజర్ డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు తొలగించడంతో పాటు వలకట్లను వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు..





కలెక్టరేట్ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న అల్లవరం మండల రైతులు

నాలుగేళ్ల క్రితం ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలు చూపుతున్న ఈదరపల్లి గ్రామస్తులు

పట్టాలు ఇచ్చారు సరే స్థలాలు ఎక్కడ: ఈదరపల్లి గ్రామస్తులు

నాలుగేళ్ల క్రితం ఈదరపల్లి గ్రామంలోని నిరుపేదలకు పేరూరులో ఇళ్లస్థల పట్టాలు ఇచ్చారు. ఆ పట్టాలను రెండోసారి రిజిస్ట్రేషన్ సైతం చేశారు. కానీ ఇంత వరకు ఎక్కడ లేఅవుట్ వేశారో ఎక్కడ తమకు ఇళ్లస్థలాలు కేటాయించారో తెలియని పరిస్థితి. గ్రామస్థాయి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం ఉండడం లేదు. అద్దె ఇళ్లల్లో, రోడ్ల పక్కనా జీవనం సాగిస్తున్నామని ఇళ్లస్థల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని పిస్సింటి ఆదిలక్ష్మి, కొండపు యర్రాయమ్మ, బండి భవానీ. కె.రావులమ్మ తదితరులు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో అర్జీ అందించారు.

దారి చూపించండి: పెయ్యలవారిపేట వాసులు

అనాతవరం పంచాయతీ పరిధిలో పెయ్యలవారి పేటలో దశాబ్ద కాలంగా జీవనం సాగిస్తున్నామని, పేటకు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తి రోడ్డు మార్గాన్ని అడ్డుకుంటున్నారని, కనీసం కుళాయిల నుంచి మంచినీరు కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని కాలనీకి చెందిన కుంచే వెంకటరత్నం, కుంచే రమేష్, కుంచే సత్యవతి, కుంచే మణికుమారి అర్జీ అందించారు.

ఘనంగా ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు





మామిడికుదురు: తీర్థపు బిందెలతో జలాలను తీసుకువస్తున్న అర్చకులు, ఆండాళ్ తాయారుతో ధనుర్మాస దీక్ష ఆచరింపచేస్తున్న అర్చకులు

మామిడికుదురు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో ధనుర్మాసోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. పవిత్ర ధనుర్మాస ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు మేళతాళాలతో ఊరేగింపుగా వైనతేయ నదికి చేరి తీర్థపు బిందెలతో అక్కడి జలాలను తీసుకువచ్చి అభిషేకం నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆండాళ్ తాయారుకి పంచామృత స్నపనం చేశారు. నెల రోజుల పాటు ఈవిధంగా తీర్థపు బిందెలతో జలాలను తీసుకువచ్చి తెల్లవారుజామునే అభిషేకం నిర్వహించనున్నారు. సోమవారం నుంచి అమ్మవారితో ధనుర్మాస దీక్షను అర్చకులు స్వీకరింప చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ధనుర్మాసం సందర్భంగా భక్త దంపతులకు ప్రత్యేకంగా షోడస కేశవ నామాలతో శ్రీబాలబాలాజీస్వామివారు వెలసిన ఆలయాల్లో తులసీపత్రం, బిల్వపత్రం చామంతి పూలతో అర్చన, ప్రత్యేక దర్శనంతో ఆశీర్వచనం ఇస్తారని, ఈఅర్చన కార్యక్రమాన్ని భక్తులు వినియోగించుకోవాలని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

ధనుర్మాసం పూజలు

ఐ.పోలవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మురమళ్ల భద్రకాళీసమేత వీరేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నెల రోజులు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహిస్తారు. ఈనెల26న లక్ష తులసి పూజ, జనవరి 13న గోదాదేవి కల్యాణం జరిపించనున్నట్టు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక మహిళామండలి ఆధ్వర్యంలో తిరుప్పావై సేవ నిర్వహించనున్నారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. 215మందిభక్తులు పంచామృతాభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో స్వామి దర్శనం, ఆలయ పురోహితుడు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రాతఃకాల పూజలు

కాట్రేనికోన, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గెద్దనపల్లి పంచాయతీ చింతలమెరక సీతారాముల ఆలయంలో సోమవారం ధనుర్మాస ప్రారంభ పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లకు ప్రాతఃకాల పూజలు జరిగాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ పురోహితుడు ఆకొండి శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఈవో సలీంబాషా

జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యాపరంగా జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అన్ని విభాగాల అధికారులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా సూచించారు. ముమ్మిడివరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, జిల్లా డిజిగ్నేటెడ్, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సబ్జెక్టు నిపుణులు తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకుని వాటిని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల కోసం సబ్జెక్టు నిపుణులు రూపొందించిన వీడియో పాఠాలను మరింత విస్తృతంగా ప్రాచుర్యం చేయడానికి మార్గదర్శకాలు సిద్ధం చేయాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో వర్క్‌షాపు నిర్వహణకు తగిన ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సైన్స్ ఫెయిర్ నిర్వహణకు విద్యార్థులను ప్రోత్సహించి బడ్జెట్ కేటాయింపుపై స్పష్టమైన మార్గదర్శకాలను సిద్ధం చేయాలన్నారు. స్కౌట్స్, గైడ్స్‌కు సంబంధించి దశలవారీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని క్రీడల ప్రాముఖ్యతను పెంచడానికి విద్యార్థులను ప్రోత్సహించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతీ అధికారి తన పనికి సంబంధించిన ప్రగతిని నెలకు ఒక్కసారి నివేదిక రూపంలో డీఈవో కార్యాలయానికి సమర్పించాలన్నారు. ప్రతీ అంశంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించిన సంబంధిత అధికారులతో సమన్వయం కావాలన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లాలో విద్య, పర్యావరణ, క్రీడలు, సైన్స్ వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఏడీ-1 నాగేశ్వరరావు, ఏడీ-2 సురేష్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాష్, హాస్టల్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ హనుమంతరావు, సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీబీవీ సుబ్రహ్మణ్యం, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ ప్రభావతి, జిల్లా ఓపెన్‌స్కూలు కోఆర్డినేటర్ సాయి, సెక్టోరియల్ అధికారి రమేష్, సత్యనారాయణ, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కోడింగ్ అధికారులు, ఐటీ స్టాఫ్ తాతారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యానాంలో ప్రజాపద్దుల కమిటీ పర్యటన

ఆడిట్ సెన్సిటైజేషన్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): యానాం పరిపాలన శాఖకు సంబంధించి ఆడిట్ సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహణకు పుదుచ్చేరి ప్రజాపద్దుల కమిటీ యానాంలో పర్యటించింది. రెండు రోజుల పర్యటనకు ఆదివారం రాత్రి ఈబృందం యానాం వచ్చింది. ఈబృందంలో పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, డిప్యూటీ స్పీకర్ రాజవేలు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ రమేష్‌తో పాటు 22మంది ఎమ్మెల్యేలు, అధికారులు యానాం వచ్చారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి అధ్యక్షతన స్థానిక డిగ్రీ కళాశాల సమావేశం హాలులో జరిగిన కార్యక్రమంలో పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, డిప్యూటీ స్పీకర్ రాజవేలు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితరులు హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడారు. ఢిల్లీ ప్రతినిధి మల్లాడి మాట్లాడుతు యానానికి సంబంధించిన ప్రధానంగా మూడు సమస్యలను (వరద రక్షణ గట్టు, మాస్టర్ ప్లాన్, రీజెన్సీ పరిశ్రమ) అంశాలను వివరిస్తూ స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌తో పాటు 25మంది ఎమ్మెల్యేలు, ఇతర అధికారులకు వినతిపత్రాలను మల్లాడి అందజేశారు. అనంతరం మల్లాడి స్వగృహానికి చేరుకున్న అతిథులు తర్వాత విశాఖపట్నం పయనమై వెళ్లారు. సమావేశంలో యానాంలోని వివిధ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దేవాలయం తొలగింపును అడ్డుకున్న స్థానికులు



అబ్బిరెడ్డి కాలనీలో ధర్నా చేస్తున్న స్థానికులు, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ధర్నా

అమలాపురం రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా ఆలయ నిర్మాణం చేపట్టడంతో తొలగించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో స్థానికులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు సుమారు 6గంటల పాటు ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిని ఆనుకుని కామనగరువు అబ్బిరెడ్డి వారి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన స్థానికులు వినాయకుని మందిరం నిర్మిస్తున్నారు. స్థానిక సబ్‌స్టేషన్ సమీపంలోనే ఆలయం నిర్మించడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తూ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో సోమవారం మధ్యాహ్నం అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే దేవాలయం శ్లాబ్ నిర్మాణం సైతం పూర్తి చేయడంతో పాటు ఆలయంలో పూజలు చేయడం ప్రారంభించారు. అయితే సర్వే అనంతరం ప్రభుత్వ స్థలంలోనే గుడి నిర్మాణం జరుగుతుందని గుర్తించడంతో వినాయకుని గుడి, ఆంజనేయస్వామి విగ్రహాలను తొలగించాలని ఆర్డీవో పంచాయతీ కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజును ఆదేశించారు. సమాచారం తెలుసుకున్న కాలనీవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆందోళనకు దిగారు. బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు కూడా పాల్గొన్నారు. స్థానిక అధికారులు పలు పర్యాయాలు నాయకులు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్య తదితరులతో చర్చించారు. ఒక దశలో మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, స్థానిక పెద్దల మధ్య చర్చలు జరిగాయి. ఫలితం లేకపోవడంతో చివరకు రాత్రి 7గంటల సమయంలో పంచాయతీ సిబ్బంది, అధికారులు అక్కడి నుంచి వాహనాలు తీసుకుని వెళ్లిపోవడంతో స్థానికులు ఆందోళన విరమించారు. ఆర్డీవో వెంట ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఈవో పీఆర్డీ బి.మంగాదేవి, తాలూకా ఎస్ఐ వై.శేఖర్ బాబు, పర్తంశెట్టి ఆదినారాయణ తదితరులు ఉన్నారు. ఆందోళనలో పోలిశెట్టి మంగాదేవి, గాలి దేవర వెంకటలక్ష్మి, మందపాక రామానుజమ్మ, గుర్రాల దేవి, పిచ్చిక సుబ్బారావు, చింతా హేమకుమార్, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా తొలగని ముసుగు



పి.గన్నవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముసుగు తొలగించండి బాబూ....అంటూ ఆ విగ్రహం వేడుకుంటోంది. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో పలు గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఇటీవల ఎన్నికల కోడ్ ముగిసినప్పటికి పి.గన్నవరం అక్విడెక్టు లంకలగన్నవరం వైపు ఉన్న మాజీ ఎమ్మెల్సీ బోళ్ల వెంకటసత్యనారాయణమూర్తి విగ్రహంపై ముసుగు పంచాయతీ అధికారులు తొలగించలేదు.

కవి వెంకట్‌కు సత్కారం

అంబాజీపేట, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఆదివారం అంతర్జాతీయ సాహిత సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో అంబాజీపేటకు చెందిన సహజ కవి పొలమూరి వెంకట్‌ను సన్మానించారు. ఈసందర్భంగా దేవుడా ఏమిటీ మాయ అనే కవితా గానం చేసినందుకు కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆయనను సత్కరించారు. కొల్లి రమావతి, ఈశ్వరి, పార్థసారధి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ కేతా

రాజోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది గజమాల యాత్ర వ్యవస్థాపకుడు చింతా మహానాగరాజు జన్మదిన వేడుక సందర్భంగా సోంపల్లిలో రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ కేతా శ్రీను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మహానాగరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ కేతా మాట్లాడుతూ మహానాగరాజు అంతర్వేది గజమాల యాత్రను ప్రారంభించి పదకొండు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. రక్తదానం చేసిన 30 మంది యువకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, శంకరపు ఆదినారాయణ, అంతర్జాతీయ యోగా కోచ్ మల్లాడి నారాయణ, ఇల్లింగి వెంకటరమణ, లంకే దుర్గాప్రసాద్, కొల్లు గౌతమ్, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల అగ్నికుల క్షత్రియ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈ వేస్ట్ ద్వారా సంపాదన

మలికిపురం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఈ-వేస్ట్‌తో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం వివేకానంద ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 1ఎం1బీ గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ-వేస్ట్ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్టేట్ ఇన్‌చార్జి సాగర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, ఈ-వేస్ట్ రీసైక్లింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈసంస్థ పనిచేస్తుందన్నారు. గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఖాళీ సమయాల్లో ఈ-వేస్ట్‌ను సేకరించి పాఠశాలలో క్లబ్ సభ్యులకు అందించారు. తద్వారా రూ.2760 ఆర్జించినట్లు సాగర్ తెలిపారు. ఈసొమ్ముతో విశ్వేశ్వరాయపురం, గుడిమెళ్లంక వంతెన వద్ద మొక్కలు నాటతామని విద్యార్థినులు సాధిక, రోజిలిన్ చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

మొక్కలను నాటి సంరక్షిస్తే మంచి ఫలితాలు

అంబాజీపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకుని కాపాడితే మంచి ఫలితాలు సాధించవచ్చునని నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలక్ష్మి సూచించారు. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో చైర్మన్ గణపతి వీరరాఘవులు అధ్యక్షతన మొక్కల ఆరోగ్య నిర్వహణ అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ సహజ, సేంద్రియ పంటల ఉత్పత్తిలో మొక్కల ఆరోగ్య నిర్వహణ, మొక్కల రక్షణలో బయోయాక్టివ్ సమ్మేళనాల పాత్ర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో అపారంగా ఉన్న కొబ్బరి పంటకు సోకే వివిధ రకాల తెగుళ్లు, పురుగులకు క్షేత్రస్థాయిలో చర్యలను రైతులు చేపడితే చాలావరకు నష్టాన్ని నివారించవచ్చన్నారు. శాస్త్రవేత్త శైలజ, రైతు నాయకులు ముత్యాల జమీలు, అడ్డాల గోపాల కృష్ణ, యాళ్ళ వెంకటానందం పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ నిరుపేదలకు బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో గృహ సముదాయవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. అమలాపురం వచ్చిన అజయ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆనందరావు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లింగోలు పండు, నల్లా శ్రీధర్, కంచిపల్లి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ

అమలాపురం రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి బైపాస్ రోడ్డులోని శ్రీకోనసీమ మహాశాస్త అయ్యప్పస్వామి ఆలయ గౌరవాధ్యక్షుడు వాసన పుల్లయ్యనాయుడు ఇటీవల మృతిచెందారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మోరం దొరబాబు, రామాయణం వెంకటేశ్వరరావు, సంగినీడి గణేష్, బందారు గంగాధరం, నల్లా చిట్టిబాబు, ఆర్వీ నాయుడు, నడింపల్లి సత్తిబాబురాజు, చాగంటి ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు

అమలాపురంటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల17,18 తేదీల్లో అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. 18వతేదీ అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో మధ్యాహ్నం 3గంటలకు జరిగే బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ, ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఆండ్ర మాల్యాద్రి, బి.బలరామ్ పాల్గొని మాట్లాడతారన్నారు. ఫిబ్రవరిలో నెల్లూరులో రాష్ట్ర మహాసభలు, ఏప్రిల్‌లో జాతీయ మహాసభలు మధురైలో నిర్వహించనున్నట్టు వివరించారు. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశిస్తారన్నారు. అనంతరం జిల్లా కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు.జిల్లా కమిటీ సభ్యుడు గుదే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పద్మనాభం

ఉప్పలగుప్తం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పలచోళ్ల పద్మనాభం నియమితులయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వ్యవహరిస్తారు.ఉపాధ్యక్షుడిగా లంకే భీమరాజు, సంయుక్త కార్యదర్శిగా అయితాబత్తుల అజయ్ సింగ్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఫిజికల్ డైరెక్టర్ గొలకోటి ఫణీంద్రకుమార్, సభ్యులుగా మన్నె వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరాజు, పీవీవీ నాగేశ్వరరావు, ఎ.నరేష్ నియమితులయ్యారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ముమ్మిడివరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తాడి శ్రీ వెంకటాచార్య తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి ఈనెల17,18 తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు బ్యాచ్‌లుగా ఈశిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈశిక్షణా తరగతులకు మండలంలోని 16 గ్రామపంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

సాహితీలోకానికి బోయిభీమన్న సేవలు వెలకట్టలేనివి

మామిడికుదురు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సాహితీలోకానికి మహాకవి బోయి భీమన్న సేవలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా పేర్కొన్నారు. బోయి భీమన్న వర్ధంతిని మామిడికుదురులోని బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి సాహితీ లోకానికి ఆయన చేసిన సేవలను వివరించారు. గెయిల్ ఇన్‌చార్జి ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ బలోపేతానికి కృషి

మామిడికుదురు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీఆర్టీయూ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు అన్నారు. పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా పొన్నపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా యాళ్ల పల్లంరాజు, ప్రధాన కార్యదర్శి చింతా రమేష్, ఆర్థిక కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి, జిల్లా కౌన్సిలర్లగా కేవీడీ ప్రసాద్, మట్టా శ్రీనివాసరావు, మాగాపు విజయదుర్గారావు, ముత్యాల వీఆర్ నాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు పీఆర్టీయూ నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవార్లకు సారె సమర్పించిన భవానీలు

అంబాజీపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాచవరంలో గ్రామదేవతలు శ్రీ ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు భవానీలు వివిధరకాల స్వీట్లు, పండ్లతో సారె సమర్పించారు. గురుభవానీలు దంగేటి సాయిబాబు- మల్లేశ్వరి దంపతులు, మట్టపర్తి దుర్గారావు(ఏసు), మట్టపర్తిదుర్గాప్రసాద్‌ల ఆధ్వర్యంలో పోతాయిలంక శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి మహిళలు, భవానీలు స్వీట్లు, చలివిడి, పానకాలు, పసుపు, కుంకుమ, పండ్లతో ర్యాలీగా తరలి వచ్చి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సారె సమర్పించారు. కార్యక్రమంలో గురుభవానీలు ముత్యం గురువాణి, దొరబాబు, మట్టపర్తి శ్రీనివాస్, సుబ్బారెడ్డి, యండ్ర శ్రీను, పాటి శేఖర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం మాచవరంలో అన్నసమారాధన నిర్వహించారు.

నేటి నుంచి కిక్ బాక్సింగ్ పోటీలు

రాజోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కొలిగేటివ్ టోర్నమెంట్ కిక్ బాక్సింగ్ మెన్ అండ్ ఉమెన్స్ పోటీలు ఈనెల 17,18 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన సోమవారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈపోటీలకు నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలలన్నీ పాల్గొనాల్సిందిగా కోరారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు కళాశాలలో హాజరు కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ డాక్టర్ బి.మధుకుమార్, ఇన్‌చార్జి స్పోర్ట్స్ నల్లి రాజు, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని మౌన ప్రదర్శన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ సిబ్బంది

అమలాపురం టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. సిబ్బంది నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని మౌన ప్రదర్శన చేశారు. ఇంజనీరింగ్ ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని అర్జీ అందించారు. 15సంవత్సరాలు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని కోరారు.

పెదపట్నం రీచ్ నుంచి ఇసుక ఇప్పించండి

మామిడికుదురు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరం గ్రామానికి సమీప గ్రామం పెదపట్నం రీచ్ నుంచి తమకు ఇసుక ఇప్పించాలని నగరం గ్రామస్తులు సోమవారం తహశీల్దార్ ఆచార్యులుకు వినతిపత్రం అందించారు. పెదపట్నం రీచ్ మాదేనని గ్రామానికి చెందిన కొందరు నాయకులు పెత్తనం చేస్తూ మిగితా ఏ గ్రామానికి ఇసుక ఇవ్వమని చెబుతున్నట్టు పేర్కొన్నారు. పెదపట్నం రీచ్ నుంచి ఇసుక ఇప్పించి తమ అవసరాలను తీర్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, పి.నానిబాబు, బి.గంగాలక్ష్మి, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలని కాంగ్రెస్ ధర్నా

కాట్రేనికోన, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయితాబత్తుల పండుబాబు ఆధ్వర్యంలో పెంచిన కరెంట్ చార్జీలను కూటమి ప్రభుత్వం వెంటనే తగ్గించాలంటూ కాట్రేనికోన గేట్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ గిడ్డి సత్యవతికి వినతిపత్రం సమర్పించారు. ముమ్మిడివరం నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పాలెపు ధర్మారావు మాట్లాడుతూ ప్రజలను ఆర్థికంగా ఇబ్బందిపెట్టేలా కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో కంచుస్తంభం సోనీ, పాలెపు ధర్మరాజు, పాలెపు శ్రీనురాజు, అంగాని నాగరాజు, మల్లాడి శ్రీను, మల్లాడి గోపీ, నవుడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమృత లింగేశ్వరస్వామికి చెరుకు రసంతో అభిషేకం

మామిడికుదురు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శివుడు ఆవిర్భవించిన రోజున పురస్కరించుకుని అప్పనపల్లి వైనతేయ నదీ తీరంలో వేంచేసి ఉన్న శ్రీఉమా అమృత లింగేశ్వరస్వామికి 108 లీటర్ల చెరుకురసం, 108 బిందెల గోదావరి జలాలతో అభిషేకాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివకేశవ భక్తబృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. 2005 నుంచి ప్రతీ సంవత్సరం మార్గశిరమాసం ఆరుద్ర నక్షత్రం రోజున భక్త బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మండల పరిధిలోని పలు శివాలయాల్లో జరిగిన ఆరుద్ర నక్షత్ర పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.3.51లక్షల దాతల విరాళం

మలికిపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థుల సౌకర్యాల కోసం మానవతా గ్రూపు సభ్యులు చేపట్టిన నిధుల సేకరణకు రూ.3.51లక్షలు దాతలు అందించారని గ్రూపు సభ్యులు బోనం రాజు తెలిపారు. హాస్టల్ విద్యార్థుల సౌకర్యాల కల్పన కోసం చేస్తున్న ప్రయత్నంలో ఎంతో మంది సాయం చేసేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు.

వైభవంగా రుద్ర హోమం

ఐ.పోలవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్ర సందర్భంగా సోమవారం రుద్ర హోమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఉప్పలగుప్తం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ గోపీ మూర్తి చెప్పారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత సాధనకు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను చట్టసభలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అరవ స్వామినాయుడు, కామన మధు, రాయి వెంకటేశ్వరరావు, హెచ్ఎం నూకల సత్యనారాయణ, పద్మనాభం, సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి మండల అధికారులకు శిక్షణ

అంతర్వేది, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి రెండు రోజులు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ సోమవారం తెలిపారు. ఉదయం 9నుంచి సాయంత్రం 6గంటల వరకు మండలస్థాయి శిక్షణ 17,18 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. మండలంలోని లైన్ డిపార్టుమెంట్ సభ్యులకు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు, రెవెన్యూ, పోలీసు, వైద్య, వెటర్నరీ, ఫిషరీస్, హార్టికల్చర్ తదితర ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ, మానసిక స్థైర్యం

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ, మానసిక స్థైర్యం సమకూరుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం పట్టణంలో చెలికాని రామారావు స్మారక భవనంలో సెకండ్ ఇంటర్ స్కూల్స్ కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా పాఠశాల స్థాయిలో మార్షల్ ఆర్ట్స్ శిక్షణకు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళతానని అన్నారు. ముఖ్య అతిథులుగా మోడరన్ అధినేత లయన్ జీవీ రావు, వ్యాపారవేత్త చింతా వెంకట రెడ్డి, చింతా సుబ్బారెడ్డి, చాంబర్ అధ్యక్షుడు నల్లమిల్లి జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 250 మంది వరకు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. దీనికి న్యాయ నిర్ణేతలుగా మాస్టర్ బి.కె.రత్నం, వై.అంజనీకుమార్, ఎన్.గిరి, ఎం.శేఖర్, పి.బాలకృష్ణ, సీహెచ్ వినయ్‌కుమార్, ఎస్.వెంకటేష్, ఎం.నళిని వ్యవహరించినట్టు మాస్టర్ బి.కె.రత్నం తెలిపారు. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందించారు.

వైభవంగా విక్రమభట్టీశ్వరస్వామికి అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చరిత్ర సంతరించుకున్న పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామికి సోమవారం అన్నాభిషేకం జరిపారు. మర్గశిర మాసం ఆరుద్ర నక్షత్రంతో కూడిన శివముక్కోటి సందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. గ్రామ స్తులు, దాతలు, దేవదాయశాఖ సంయుక్త అధ్వ ర్యంలో పండితులు, టీటీడీ వార్షిక సన్మాన గ్రహీత కాళ్లకూరి సూరిపండు అధ్వర్యంలో పండితులు వెలవలపల్లి చైతన్యకృష్ణ, కాలదరి కార్తికేయ, కాళ్లకూరి నరేంద్రశర్మ, సత్యవోలు సుబ్రహ్మణ్యం తదితరులు స్వామివారికి అన్నాభిషేకం జరిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, కూటమినేత వంటిపల్లి పాపారావుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అగస్తేశ్వరస్వామికి అన్నాభిషేకం

మండపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రథం గుడి సెంటర్‌లోనున్న అగస్తేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం వేకువజామున ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం సారధ్యంలో అర్చకస్వాములు స్వామివారికి అన్నాభిషేకం జరిపారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి అన్నాభిషేకం జరుపుతున్న దృశ్యం →



సంఘమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు

మండపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏడిద గ్రామంలోనున్న సంఘమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పంచామృతాభిషేకాలు జరిపారు. ఐనవిల్లి సత్యనారాయణ నేతృత్వంలో శర్మ బృందం స్వామివారికి వేకువజామున నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆరుద్ర నక్షత్రంతో పాటు మార్గశిర మాసం రావటంతో స్వామివారికి అభిషేకాలు, పూజలు జరగ్గా పలువురు భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

ధనుర్మాసం పూజలు ప్రారంభం

కె.గంగవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయాసోమేశ్వస్వామి ఆలయంలోని సిద్ధి జనార్ధనస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాసం పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మండలంలోని ఆయా ఆలయాల్లో భక్తులు ధనుర్మాసం పూజలు చేశారు.

రాయవరం: మండలంలోని వైష్ణవ ఆలయాల్లో సోమవారం ధనుర్మాసం పూజలు ప్రారంభమయ్యాయి. రాయవరంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపారు. వెదురుపాక జనార్ధనస్వామి ఆలయంలో అంగర సూర్యనారాయణాచార్యులు, అంగర జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పూజలు చేశారు. ఈసందర్భంగా జనార్ధనాచార్యులు మాట్లాడుతూ సోమవారం నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు ధనుర్మాసం పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, వెంటూరు గ్రామాల్లో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత గోపాలస్వామి ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, తిరుప్పావై సేవలు, అష్టోత్తర సహస్ర నామాలతో అర్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహానివేదన జరిపారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచే వైష్ణవాలయాలు కిటకిటలాడాయి.



వెదురుపాకలో ప్రత్యేక అలంకరణలో జనార్ధనస్వామి. పక్క చిత్రంలో కోటిపల్లిలో సిద్ధి జనార్ధనస్వామి

నేటి నుంచి సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

కె.గంగవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్. శ్రీనివాసు తెలిపారు. మండల వెలుగు కార్యా లయంలో సచివాలయ సిబ్బందికి, సర్పంచ్ లకు శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 9 గంట లకు ప్రారంభమయ్యే శిక్షణకు సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు హాజరు కావాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు.

వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువజామున అర్చకులు మేళతాళ మంగళవాయిద్యాలతో గోదావరి జలాలను తీసుకువచ్చి స్నపనమూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై సేవాకాలం జరిపి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. నెలరోజులపాటు నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాల్లో ప్రతి శుక్రవారం గోదాఅండాళ్ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. భోగిరోజున గోదాశ్రీ రంగనాధుల కల్యాణంతో ధనుర్మాస ఉత్సవాలు ముగియనున్నాయి. ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభించారు. వెంకన్న ఆలయంలో నోము ఆచరించిన పలువురు భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,10,732 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వచ్చే ఏడాది నుంచి విద్యుత్ కోతలకు చెక్

మండల సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) నియోజకవర్గంలో 2025 నాటికల్లా లోఓల్టేజ్, విద్యుత్‌కోతలు లేకుండా రోజంతా కరెంట్ సరఫరా చేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు చెప్పారు. మండల పరిషత్ బడ్జెట్ సమా వేశం ఎంపీపీ ఉండమట్ల వాసు అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కాలం చెల్లిన విద్యు త్ స్తంభాలు తొలగించి కొత్తవి వేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో పంత, లింకురోడ్ల నిర్మా ణానికి రూ.80 కోట్లమేర ప్రభుత్వానికి ప్రతిపాద నలు పంపామన్నారు. గ్రామాల్లో సమస్యల పరి ష్కారానికి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుం టామన్నారు. వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల సమావేశంలో తెలిపారు. తహశీల్దార్ తేజేశ్వరరావు మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం కేశవరం, జెడ్. మేడపాడు గ్రామాల్లో ఆర్వోబీలు మంజూరు చేసిందని భూసేకరణ కూడా పూర్తయిందన్నారు. ఎంపీపీ వాసు 2025-26 సంవత్సరానికి సంబం ధించిన బడ్జెట్ ప్రవేశపెట్టగా కార్యాలయ పరిపా లన అధికారి ప్రసాద్ వినిపించారు. బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. అనంతరం వివిధ సమస్యలపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి, ఈవో పీఆర్డీ దాసరి శ్రీనివాసరావు తదితరులతో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు సన్మానం: మండల సమావేశానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా దీనికి హాజరైన ఎమ్మెల్యే వేగుళ్లను, ఎంపీపీ ఉండమట్ల వాసు, వైస్ ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు.



కె.గంగవరం: దంగేరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ మృత్యుంజయరావు



కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్ట రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జడ్పీటీసీ అబ్బు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

కపిలేశ్వరపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు అన్నారు. సోమవారం మండలంలోని నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు జరిగాయి. నిడసనమెట్ట గ్రామసభలో జడ్పీటీసీ అబ్బు పాల్గొని మాట్లాడారు. తహసీలార్ పి.చిన్నారావు మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్ఐ అర్జమ్మ, వీఆర్‌వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, సర్వేయర్లు, గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు ఐపీ శెట్టి తెలిపారు. సోమవారం మండలంలోని కురకాళ్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

కె.గంగవరం: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతులు భూసమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు అన్నారు. సోమవారం దంగేరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. తొలుత సిబ్బందితో కలిసి గ్రామంలో రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ర్యాలీ జరిపారు కార్యక్రమంలో సర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణ, ఆర్ఐ వెంకట్రావు, ఆర్ఐ దూలం నాగేశ్వరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ద్రాక్షారామ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలోనున్న భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మార్గశిరమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు సామూహిక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, చింతపల్లి సతీష్, చోడిశెట్టి వీరభద్రరావు, చెక్కా తాతాజీ, దొంతంశెట్టి సత్యప్రకాష్, పలువురు భక్తులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

సీఎం సహాయ నిధి చెక్కు అందచేత

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలం బ్రహ్మపురికి చెందిన మేడ ఏడుకొండలుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 30 వేల చెక్కును మంత్రి సుభాష్ సోమవారం అందించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఈయనకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం మంజూరు చేశారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం: రామచంద్రపురం తోరం వీధికి చెందిన వీరభద్రరావు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. అతని భార్య దేవి తన భర్త అనారోగ్యం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. దీంతో మంత్రి సుభాష్ ఆమెకు రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు

అమలాపురంటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల17,18 తేదీల్లో అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. 18వతేదీ అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో మధ్యాహ్నం 3గంటలకు జరిగే బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ, ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, బి.బలరామ్ పాల్గొని మాట్లాడతారన్నారు. ఫిబ్రవరిలో నెల్లూరులో రాష్ట్ర మహాసభలు, ఏప్రిల్‌లో జాతీయ మహాసభలు మధురైలో నిర్వహించనున్నట్టు వివరించారు. జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశిస్తారన్నారు. అనంతరం జిల్లా కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు గుదే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం రాసుల పరిశీలన

కె.గంగవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 26 గ్రామాల్లో రైతుల పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించడానికి ఇంకా 1109 టన్నుల టార్గెట్ అవసరమని మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి తెలిపారు. సోమవారం ఆయన పేకేరు, బాలాంత్రం తదితర గ్రామాల్లో ధాన్యం రాశులు, ధాన్యం లోడులను పరిశీలించారు. ఇప్పటి వరకూ మండలంలో 26500 టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ విధానంలో రైతుల నుంచి సేకరించా మన్నారు. పదకొండు గ్రామాల్లో 1109 టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉందన్నారు. తాళ్లపోడులో 250, దంగేరులో 120, కుందూరులో 55, కూళ్ల 48, భట్లపాలిక 60, కోట 60, బాలాంత్రం 120, శివల 204, కుడుపూరు 102, అద్దంపల్లి 72, సుందరపల్లి 18 టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉందని చెప్పారు. దీనికోసం ఉన్నతాధికారులకు నివేదిక తయారు చేసి పంపించామని చెప్పారు.



ధాన్యం రాశులు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి రవి

చింతపల్లికి పలువురు పరామర్శ

ద్రాక్షారామ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల చికిత్స చేయించుకున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత చింతపల్లి వీరభద్రరావును సోమవారం శాసనమండలి మాజీ వైస్ చైర్మన్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పరామర్శించారు. రామచంద్రపురం మండలం హసన్‌బాదలో చింతపల్లి స్వ గృహానికి వచ్చిన ఆయన వీరభద్రరావు ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. ఆయనతో పాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు పెంకె సాంబశివరావు, అక్కల రాగూర్, మాజీ సర్పంచ్ సుంకర చినకాపు తదితరులు పరామర్శించారు.



చింతపల్లిని పరామర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు



పీఎంపీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

పీఎంపీల క్యాలెండర్ ఆవిష్కరణ

మండపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పీఎంపీ వైద్యులకు సంబంధించి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం అసోషియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు ఆవిష్కరించారు. ఫిజియోథెరపీ వైద్యులు సాయితేజస్వి చేతుల మీదుగా సభ్యులు క్యాలెండర్‌ను అవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె. సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బళ్ల వెంకట రమణ, ఐ.రవికుమార్, వి.కనకరాజు, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణిత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామానుజన్ గణిత పోటీల్లో రామచంద్రపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు డైరెక్టరు బీఎస్ సరోజిని, ఈడీ సీహెచ్ శైలూష తెలిపారు. ఆరో తరగతికి చెందిన ఎస్.సూర్యమానస్ ప్రథమ, నాల్గో తరగతికి చెందిన పి.ప్రాకృతి ద్వితీయస్థానం పొందినట్టు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

ఆపన్నులను ఆదుకోవడంలో సీఎం ముందంజ

కొత్తపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆపన్నులకు భరోసా కల్పించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ముందంజలో ఉంటారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వైద్యం చేయించుకుని సీఎం సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు రోగులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం వాడపాలెంలో ఆయన పంపిణీ చేశారు. సుమారు 17 మందికి రూ.12,94,435 విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, కరటూరి నరసింహారావు, మెర్ల గోపాలస్వామి, తోటకూర సుబ్బరాజు, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సత్యానందరావు

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నేటి ఉదయం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్‌లు, మున్సిపల్ అధికారులు హాజరవుతారని ఆయన తెలిపారు.

ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోండి

మండపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 28వ తేదీ వరకు పట్టణంలో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, బుధవారాలు ప్రకాశం స్కూల్ అంగన్‌వాడీ సెంటర్, 19, 20 తేదీలు రావులపేట, జనార్దన మున్సిపల్ హైస్కూల్, 26, 27న సత్యశ్రీ రోడ్డు, ఎస్ఎస్‌వీవీ హైస్కూల్, 28న ఎస్సీ కాలనీ బాపూజీ స్కూల్‌లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

రాయవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు మండలంలోని 12 గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు జరిగే శిక్షణకు హాజరవ్వాలన్నారు.

బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు

మండపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణం, మండలంతో పాటు, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో వున్న వ్యాపార సంస్థలు, ఇటుకల బట్టీలు, ఇతర సంస్థల్లో 18 ఏళ్లలోపు బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని కార్మికశాఖ సహాయకాధికారి కె.నాగశివమల్లేశ్వరరావు హెచ్చరించారు. మండపేట కార్మికశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పనిచేసే కార్మికులకు సంబంధించి కేంద్రం అందించే ఈ శ్రమ్ కార్డులు, చేయించుకోవాలని, పీఎంఎస్‌వైఎంలో (పెన్షన్ స్కీం)లో చేరాలని ఆయన కోరారు. ఈ స్కీంలో కోటి వరకు టర్నోవర్ వున్న వారు చేరవచ్చన్నారు. ఈ పథకంలో చేరేందుకు 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులన్నారు. కార్మికశాఖ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన వ్యాపారులు, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలను హెచ్చరించారు.

బాల్య వివాహాల నివారణ చట్టాలపై అవగాహన

రావులపాలెం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ జి.సుమలత ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు అధ్యక్షతన బాల్యవివాహల చట్టాల నివారణ అంశంపై అవగాహన సదస్సు జరిపారు. దీనికి ముఖ్య అతిధిగా రాజమహేంద్రవరం కోర్టు న్యాయవాది ఎస్.విమల పాల్గొని మాట్లాడారు. అనంతరం స్థానిక పారా సంస్థ ప్రతినిధి ఎస్.ఐశయ్య పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం బాల్యవివాహాల నిషేధంపై పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు యు.సుభాషిణి, ఎస్.అరుణకుమార్, ఎం.రజని, జి.సోని తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్పీ శ్యామ్

మాచరలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ

కపిలేశ్వరపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షతన సోమవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభ జరిపారు. ఈ సభలో ఎస్ఆర్పీ కనకారావు పలు అంశాలపై వివరించారు. డీఆర్పీ డి.శ్యామ్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంత్సరానికి సంబంధించి క్షేత్రస్థాయిలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో సేకరించిన పనుల వివరాలను వినిపించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుడాల జయబాబు, ఉపసర్పంచ్ అడపా వేణు, వాసంశెట్టి విష్ణుమూర్తి, ఎంఈవో కె.తాతారావు, ఏపీవో రవికిరణ్, జేఈ రజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీకి నూతన భవనాలు నిర్మించాలని విద్యార్థుల ధర్నా

ఆలమూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనాలు శిథిలావస్థకు చేరాయని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నూతన భవనాలు నిర్మించాలని కోరుతూ సోమవారం ఆలమూరు కాలేజీ వద్ద మెయిన్ రోడ్డుపై విద్యార్థులు ధర్నా జరిపారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు కొద్దిసేపు ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ జూనియర్ కాలేజి భవనాలు శిథిలమై 20ఏళ్లు గడిచినప్పటికీ అదే భవనాల్లో క్లాసులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడుతున్నారన్నారు. నూతన భవనాలతోపాటు ఆటస్థలం అభివృద్ధి చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తక్షణం భర్తీ చేయాలని వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.